క్లుప్తంగా

28న నిరుద్యోగులకు జాబ్ మేళా

బాపట్ల: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.సుధాకర్ తెలిపారు. బాపట్లలోని స్థానిక సాల్వేషన్ ఆర్మీ ఐటీఐలో ఉదయం 9గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని చెప్పారు. 18 నుంచి 28 వయసు కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు కార్యక్రమంలో పాల్గొన్నాలని సూచించారు. వివరాలకు 8555901198, 9346280289 సంప్రదించాలని కోరారు.

ఎన్ఆర్ఐల సహకారం అభినందనీయం



నగరం: కళాశాల అభ్యున్నతికి, ఎన్ఆర్ఐల సహకారం అభినందనీయమని ఎస్వీఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్య చౌదరి చెప్పారు. స్థానిక కళాశాలలో ఎన్ఆర్ఐ డాక్టర్ రమాదేవి సన్మాన సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి ఏడాది కళాశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డాక్టర్ రమాదేవి ప్రోత్సాహక నగదు బహుమతులను అందింస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారయణ, పరిపాలనాధికారి మాగంటి సుధాకరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె: అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పి.నాగాంజనేయులు కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శనివారం నిర్వహించిన ఒక్కరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం తెనాలి డివిజన్ కన్వీనర్ నాగమల్లేశ్వరమ్మ, సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

రేపల్లె రూరల్: వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం సోమవారం నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి డి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ ఆవరణ ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పాస్టర్ తిమోతి శనివారం తెలిపారు. చెరుకుపల్లి శ్రీ కామాక్షి ఐకేర్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేపల్లె: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఏడుకొండలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. పట్టణంలోని నేతాజీనగర్, తాలూకా సెంటరు, ఇండియన్ బ్యాంకు రోడ్డు వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

బాపట్ల టౌన్: ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జమ్ములపాలెంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఎం.వెంకయ్య(50) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధ తాళలేక శనివారం పొలంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

అయ్యప్ప దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలి టౌన్: బాలాజీరావుపేటలోని ప్రధాన అయ్యప్ప దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో అంకురార్పణ, ధ్వజారోహణ హోమాలు నిర్వహించారు. శాంతి పూజలు జరిపారు. స్వామివారిని చిన్నశేష వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

రూ.25లక్షలతో అభివృద్ధి పనులు

తెనాలి టౌన్: రూరల్ మండలం అంగలకుదురులో రూ.25లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు సర్పంచి ఊసరపు రాజ్యలక్ష్మి తెలిపారు. డ్రెయిన్ పూడికతీత పనులు శనివారం పరిశీలించారు. ఆమె వెంట ఉప సర్పంచి కనగాల నాగభూషణం, వార్డు మెంబర్లు ఉరిటి శ్రీనివాసరావు, తేజశ్రీ, ఫరీదు, శ్రీరామ్ బాజీ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు పాల్గొన్నారు.

ఐలవరం.. విద్యాచైతన్యం

- చదువులో రాణిస్తున్న విద్యార్థులు
- ట్రిపుల్ ఐటీలో సత్తా.. ఎన్ఎంఎంఎస్‌కు అర్హత
- వర్చువల్ క్లాసులతో విదేశీ విద్యావిధానంపై అవగాహన
- ఆంగ్లంపై పట్టు.. నాడు–నేడుతో మారిన రూపురేఖలు
- ఆదర్శంగా నిలుస్తున్న ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల



ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం ఒక చైతన్య గ్రామం. చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి. చిన్న బొంబాయిగా ప్రసిద్ధిగాంచిన ఈ మేజర్ పంచాయతీ ఎంతో మంది మేధావులకు పుట్టినిల్లు. ఇక్కడ ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగి కనిపిస్తాడు. వ్యాపారం, స్వర్ణకార వృత్తిలో స్థిరపడ్డవారు అధికం. ఈ గ్రామంలో విద్యాపరంగా రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించింది స్థానిక పరిషత్ ఉన్నత పాఠశాల.

ఐలవరంలో ఉన్నత పాఠశాల ఉన్నప్పటికీ ఒకప్పుడు నాలుగు కిలోమీటర్లు కాలినడకనో, సైకిల్ పైనో వచ్చి భట్టిప్రోలులోని టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులు విద్యాభ్యాసం చేసేవారు. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. మండల కేంద్రం నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు పొందుతూ.. ఎన్ఎంఎంఎస్ అర్హత సాధిస్తున్నారు. ఇప్పటి వరకు ట్రిపుల్ ఐటీలో 60 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. ఇందులో గతేడాది నలుగురున్నారు. ఎన్ఎంఎంఎస్‌కు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా ఇప్పటివరకు 142 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

సీఎం సమక్షంలో..ఆంగ్లంలో..

చుండూరు మండలం యడ్లపల్లి ఏవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది డిసెంబర్ 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని రాయన సాయినాగశ్రీ ఆంగ్లంలో అమ్మ ఒడి, నాడు–నేడు పథకాలపై అనర్గళంగా మాట్లాడి అందరి మెప్పు పొందింది. అలాగే విద్యార్థులను వర్చువల్ క్లాసులతో ఇతర దేశాల విద్యార్థులతో ఆంగ్ల ఉపాధ్యాయుడు హరికృష్ణ మాట్లాడిస్తున్నారు. పెన్‌పాల్ విధానం ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు విద్యార్థులతో నిర్వహిస్తూ.. వారిలో ఆత్మస్థైర్యం నింపుతూ.. విదేశీ విద్యా విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.



సీఎం సమక్షంలో ఆంగ్లంలో మాట్లాడుతున్న విద్యార్థిని రాయన సాయినాగశ్రీ

'నాడు–నేడు'తో మారిన రూపురేఖలు

నాడు–నేడు పథకంతో ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారాయి. 2020–21లో నాబార్డ్ ద్వారా రూ.76 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదులు, మెరుగైన వసతులు కల్పించడం జరిగింది. ఈ విద్యా సంవత్సరంలో ఫేజ్‌– 2 కింద రూ.83 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు.

పూర్వ విద్యార్థులు.. ఉన్నతస్థాయిలో..

ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది పూర్వ విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడినవారే. టెలికాం శాఖలో పడవల కోటేశ్వరరావు, దేవదాయశాఖలో పులిమి బాలసుబ్రహ్మణ్యం(ఐఏఎస్), పడవల నరసింహారావు, ఐఎఫ్ఎస్ అధికారి పర్రె మధుసూదన రావు, ఆర్టీసీలో చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, ఆరోగ్యశాఖలో పడవల వెంకటేశ్వరరావు ఉన్నత పదవులు చేసి, రిటైర్డ్ అయ్యారు. తెనాలిలోని ప్రముఖ ఆర్థోపెడిక్‌గా మాచర్ల వెంకట సత్యనారాయణ ఈ పాఠశాలలో చదివిన వారే. భట్టిప్రోలు కథలు పేరుతో బాల్యాన్ని అద్భుతంగా చిత్రించిన రాసిన వ్యాసకర్త నక్కా విజయరామరాజు ఈ గ్రామ వాసే. ఈ హైస్కూల్‌లో చదివిన 15 మంది గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు సాధించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అథ్లెట్స్‌గా రాణించారు.



ఉపాధ్యాయుల సమష్టి కృషితో సత్ఫలితాలు..

ఉపాధ్యాయుల సమష్టి కృషితో పాఠశాల ప్రగతి పథంలో నడుస్తోంది. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. వారిని చదివిస్తున్నారు. చుట్టు పక్కల కనగాల, భట్టిప్రోలు ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి విద్యాభ్యాసం చేస్తున్నారు.

– కాటూరి లక్ష్మీనారాయణ, హెచ్ఎం, ఐలవరం



సీఎం సమక్షంలో మాట్లాడటం నా అదృష్టం

గతేడాది సీఎం జగన్ మామయ్య సమక్షంలో ఇంగ్లిష్‌లో మాట్లాడే అవకాశం దక్కటం నా అదృష్టం. ఇంగ్లిష్‌పై మాకున్న భయాన్ని తొలగించేందుకు హరికృష్ణ సార్ ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆయన శిక్షణ వల్లే నాకు ఈ అవకాశం వచ్చింది.

–రాయన సాయినాగశ్రీ, విద్యార్థిని

పాఠశాల రోజులు మరుపురాని రోజులు

- మంత్రి మేరుగ నాగార్జున
- ఘనంగా భట్టిప్రోలు హైస్కూల్ వార్షికోత్సవం



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న మంత్రి నాగార్జున, పక్కన ఎంపీపీ

భట్టిప్రోలు: పాఠశాల చదివిన రోజులు ప్రతిఒక్కరి జీవితంలో మరుపురాని రోజులుగా మిగులుతాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలు తమ్మన మల్లికార్జునరావు హైస్కూల్ 79వ వార్షికోత్సవం, వ్యవస్థాపకుల సంస్మరణ దినోత్సవం శనివారం నిర్వహించారు. హైస్కూల్, జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని చెప్పారు. 1961లో ఈ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాశానని, ఆ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. స్పోర్ట్స్‌కు పెట్టని కోట అని, సాఫ్ట్‌బాల్‌లో కొసన వెంకట సుబ్బారావు(ఎస్‌డీఎస్) శిక్షణను గుర్తుచేసుకున్నారు. కోవిడ్ నేపథ్యంలో హైస్కూల్ పాలకవర్గం కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటుకు సహకరించడం మరువరానిదన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలకవర్గ అధ్యక్షులు పి.మల్లికార్జునరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, గ్రామ సర్పంచి దారా రవి కిరణ్మయి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మండల ప్రత్యేక అధికారి హనుమంతరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖరరావు

భట్టిప్రోలు: జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పశు సంవర్ధకశాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. హౌసింగ్ డే సందర్భంగా గృహనిర్మాణ లబ్ధిదారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లే–అవుట్‌లో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని, ప్రధాన మార్గాల్లో మాత్రమే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారని, దీనివల్ల మిగిలిన ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు కరెంట్ సమస్య ఉందని, తాగునీటి పైప్ లైన్ అసంపూర్తిగా ఉండటంతో నిర్మాణం చేపట్టాలంటే దూరాభారం నుంచి వ్యయం వెచ్చించి నీరు తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, సర్పంచి దారా రవి కిరణ్మయి, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణ, సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు



చినపరిమిలో మాట్లాడుతున్న తహసీల్దార్ కనకదుర్గ, పక్కన ఎంపీడీఓ సుగుణమ్మ

చుండూరు(భట్టిప్రోలు): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు మొదలు పెట్టని వారి వివరాలు సేకరించాలని తహసీల్దార్ బి.కనకదుర్గ ఆదేశించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా చుండూరు మండలం చినపరిమి గ్రామంలో సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ టి. సుగుణమ్మతో కలసి సమావేశంలో మాట్లాడుతూ మార్చి 15వ తేదీ లోగా గృహ నిర్మాణాలు చేపట్టనివారి పట్టాలను రద్దు చేస్తామని తెలిపారు. వారికి భవిష్యత్‌లో గృహాలు మంజూరు కావని తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో చేరని లబ్ధిదారులను వారం రోజుల్లోగా గ్రూపుల్లో చేర్పించి రుణాలు మంజూరు చేయాల్సిందిగా మండల సమాఖ్య సిబ్బందికి సూచించారు. అనంతరం భూ రక్ష–భూ హక్కుకి సంబంధించి సర్వే చేయు నిమిత్తం రైతులు తమ ఆధారాలను వెంటనే వీఆర్వోలకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.సుభాషిణి, ఉప సర్పంచి అవుతు సాయిబాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలి

తహసీల్దార్ నాంచారయ్య

వల్లభాపురం(కొల్లిపర): ప్రభుత్వం పేదలకు జగనన్న కాలనీల్లో ఇచ్చిన ఇంటి స్థలంలో లబ్ధిదారులు తప్పని సరిగా గృహాలు నిర్మించుకోవాలని తహసీల్దారు జి.నాంచారయ్య కోరారు. మండలంలోని వల్లభాపురంలో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై శనివారం అవగాహన కల్పించారు. ఇళ్ల నిర్మాణం కొరకు మహిళలకు డ్వాక్రా నుంచి రూ.30 వేల రూపాయిలు లోను కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణంపై ఆసక్తి లేకుంటే వారి పేర్లు నమోదు చేసుకొని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పట్టా రద్దు చేసి వేరొకరికి ఇవ్వటం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సర్పంచి వల్లభాపురం నిర్మల, ఉపసర్పంచి అవుతు పోతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలకనందన, వీఆర్ఓ సాయి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి



తెనాలి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేసేందుకు గ్రామ సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం గ్రామ సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెనాలి మార్కెట్‌యార్డులో ఈ నెల 28న నిర్వహించనున్న సభకు గ్రామ, పట్టణంలోని వార్డులలో వలంటీర్లతో కన్వీనర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. తెనాలి మీద ముఖ్యమంత్రికి ఉన్న అభిమానంతో ఇక్కడకు వస్తున్నారని చెప్పారు. మంగళవారం ఉదయం ఏడు గంటలకు గ్రామాల్లో బస్సులు ద్వారా బయలుదేరి ఎనిమిది గంటల కల్లా యార్డు ఆవరణలో ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గృహ సారథులను నియమించిన తరువాత తొలిసభ తెనాలిలో జరుగుతుందని, దీనిని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కమిటీల ఇన్‌చార్జిలు షేక్ ఫరీద్, మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, గొడవర్తి సాయిహరేరామ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

భట్టిప్రోలు: జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పశు సంవర్ధకశాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. హౌసింగ్ డే సందర్భంగా గృహనిర్మాణ లబ్ధిదారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లే–అవుట్‌లో ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని, ప్రధాన మార్గాల్లో మాత్రమే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారని, తాగునీటి పైప్ లైన్ అసంపూర్తిగా ఉండటంతో నిర్మాణం చేపట్టాలంటే దూరాభారం నుంచి వ్యయం వెచ్చించి నీరు తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సబ్‌జైల్ పరిశీలన



తెనాలి రూరల్: క్షణికావేశంతోనే అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, నేరాలకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత అన్నారు. తెనాలి సబ్‌జైలును శనివారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని, జైలు ఆవరణను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. గతంలో చేసిన పొరపాట్లను ఇకపై చేయకుండా ఉండేలా జైలులోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. అవసరమైన వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహా అందిస్తామని చెప్పారు. న్యాయమూర్తి వెంట ప్యానల్ న్యాయవాది షంషీర్ బాషా, యర్రంశెట్టి అనిల్‌కుమార్, సబ్‌జైలు సూపరింటెండెంట్ కృష్ణారావు ఉన్నారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యం

- మంత్రి మేరుగ నాగార్జున
- తురిమెళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వం సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున

తురిమెళ్ల(వేమూరు): రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమృతలూరు మండలంలోని తురిమెళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్లు నిర్మించాలని, సైడ్ డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామ సచివాలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు. నిధులతో గ్రామంలో రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా దళితవాడలో సైడ్ కాలువలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇంకా అర్హత ఉండి పథకాలు మంజూరు కాకుండా ఉంటే గ్రామ సచివాలయంలో అర్జీ ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు ధ్యేయంగా పని చేస్తున్నారని వివరించారు. అందువల్ల సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, కోసరాజు బసవేశ్వరరావు, కోళ్లపూడి అశోక్, గ్రామ సర్పంచి అడుసుపల్లి ఇందిరా, ఎంపీటీసీ మానుకొండ ఝాన్సీరాణి, సొసైటీ అధ్యక్షులు యల్లవర్తి సురేష్, ఆడుసుపల్లి వీరయ్య, పేర్ల వెంకట సుబ్బారావు, ఒలేటి శివాజీ, బట్టు మోషే, గుమ్మడి రవి రాజా, ముక్కాల గిరిబాబు, రావి ప్రసాద్, ధారా శ్రీనివాసరరావు, గుర్రం బధు పాల్గొన్నారు.

గృహ సారథులే పార్టీకి రథసారథులు

- ఎమ్మెల్యే కోన రఘుపతి సూచన
- సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: గృహ సారథులే వైఎస్సార్ సీపీ రథ సారథులని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పనితీరును క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు గృహ సారథులు ప్రతి కుటుంబాన్ని పలకరించాలని సూచించారు. బాపట్ల పట్టణం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గృహ సారథుల శిక్షణ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదంతో గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీని మరింత పటిష్టపరిచేందుకు పార్టీకి ప్రజలకు మధ్య వారధులుగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే పచ్చ మీడియా మాత్రం కక్షగట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రచురిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుట్రను తిప్పికొట్టేందుకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గవిని కృష్ణమూర్తి, అవుట్‌సోర్సింగ్ డైరెక్టర్ బుర్రిమంచి పుష్పరాజ్యం, ఇనగలూరు మాల్యాద్రి, కాగిత సుధీర్ బాబు, సయ్యద్ పిర్, చల్లా రామయ్య, రాజశేఖర్, జోగి రాజా, ముడుగు అక్కిరెడ్డి ప్రసాద్ రెడ్డి, మీరాబాయి, కానగంటి లక్ష్మీరాఘవ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు వడ్డీముక్కల డేవిడ్ పాల్గొన్నారు.

రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలి

డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు



రక్తదానం చేస్తున్న కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: రక్తదానం చేయటంతో ప్రాణదాతలుగా మారుదని బాపట్ల వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా రెడ్‌క్రాస్ బాపట్ల, రేపల్లె శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక రక్తదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈశిబిరంలో కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావుతో పాటు పలువురు రక్తదానం చేశారు. బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.యస్.నారాయణ భట్టు రక్తదాన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కళాశాల నుంచి 65 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ సంస్థకు దానం చేశారు. రక్తదానంపై అవగాహన కల్పించి, రక్తదాన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్లు ఎం.శ్రీనివాసరావు, ఎం.సునీల్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వి.ప్రసన్న కుమారి, వి.జ్యోతి, ఐ.ఉషారాణి, ఆర్.బాల మురళీధర్ నాయక్, ఎం.రవి బాబు, కళాశాల అధ్యాపకులు బి.విజయాభినందన, కె.హేమ, ఎం.రమాదేవి, వ్యవసాయ కళాశాల వైద్యురాలు కె.జ్యోతి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

ఎంపీపీ మోహన్



మాట్లాడుతున్న ఎంపీపీ యల్లమాటి మోహన్

వేమూరు: మండల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎంపీపీ యల్లమాటి మోహన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా సహకరించాలని కోరారు. జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడి వేమూరు మండలం ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పద్మజా రెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ బాజ్జీ, శివ పార్వతి, విష్ణుమొలకల వెంకట రెడ్డియ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత, ఎంపీటీసీలు అల్లూరు యోనా, వేమూరి సుజాత, ఈపూరు కుసుమా, కోఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు పాల్గొన్నారు.

మార్చి మొదటివారంలోగా అభివృద్ధి పనుల పూర్తి

చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



కమ్యూనిటీ హాలును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ శనివారం పరిశీలించారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల్లో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. వీటన్నిటినీ చైర్‌పర్సన్ పరిశీలించారు. రూ.2.70 కోట్లతో వివిధ వార్డుల్లో అభివృద్ధి పనుల నిర్మాణం చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. మార్చి మొదటివారానికి దాదాపుగా అన్ని పనులు పూర్తి అవుతాయని చెప్పారు. పట్టణ అయితానగర్‌లోని 39వ వార్డులో నిర్మాణంలో ఉండి నిలిచిపోయిన కమ్యూనిటీ హాలును చైర్‌పర్సన్ సందర్శించారు. అసంపూర్తిగా మిగిలిన కమ్యూనిటీ హాలులో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టి, కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు త్వరగా పూర్తయేలా చూస్తామని హామీ ఇచ్చారు.